

మూడు ముక్కలాట!
దుబ్బాక నియోజకవర్గం మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో గ్రూపు విభేదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పాతతరం మారినా గ్రూపుల లొల్లి మారడంలేదు. వివరాలు 10లో ▸



చిత్తా.. బొత్తా..?
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మొదటి నుంచి పొత్తుల సంసారం. ఇప్పటి వరకు పొత్తులు లేకుండా ఎన్నికలు జరగలేదు. కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ మధ్య పోటీ ఉండేది. వివరాలు 10లో ▸



మాట తప్పకుండా అభివృద్ధి చేస్తా
గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికై తన వంతు కృషి చేస్తానని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

రూ.2.40 లక్షలు స్వాధీనం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటతోపాటు పలు గ్రామాల్లో బుధవారం చేపట్టిన తనిఖీల్లో రూ.2.40 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు. శివ్వంపేటలో రూ.లక్ష 40 వేలు, శభాష్ పల్లి వద్ద రూ.లక్ష నగదును ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. సీజ్ చేసిన డబ్బులు కలెక్టర్ కార్యాలయానికి తరలించామన్నారు. నగదుకు సంబంధించి పత్రాలు చూపించి తీసుకెళ్లాలని సూచించారు.

రామాయంపేటలో రూ.61,560



డబ్బులు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

రామాయంపేట(మెదక్): ఎన్నికల నేపథ్యంలో రామాయంపేట పోలీసులు మండల పరిధిలోని దామరచెరువు చెక్ పోస్టు వద్ద బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో మెదక్ పట్టణానికి చెందిన కృష్ణయ్య కారులో తరలిస్తున్న రూ.61,560కి సంబంధించి ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నగదును జిల్లా కేంద్రంలోని ఎన్నికల నియమావళి మానిటరింగ్ కమిటీకి అందజేసినట్లు పేర్కొన్నారు.

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి వాహనం తనిఖీ



ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

రామాయంపేట, నిజాంపేట(మెదక్): ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి వెళ్తున్న మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి వాహనాన్ని బుధవారం నిజాంపేట వద్ద ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. తనిఖీ సిబ్బందికి ఎంపీ సహకరించారని పోలీసులు తెలిపారు.

పోటీపడి అభివృద్ధి చేశా

ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

రామాయంపేట(మెదక్): బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించనప్పటికీ దుబ్బాక నియోజవర్గ అభివృద్ధికి పోటీపడి పనులు చేశానని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. బుధవారం నార్సింగి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైందన్నారు. తాను అతి తక్కువ కాలంలో చేపట్టిన అభివృద్ధిని గమనించాలన్నారు. మరోసారి అవకాశమిస్తే నియోజవర్గ రూపురేఖలు మారుస్తానన్నారు. మండల కేంద్రంలో ఏ ఒక్కరికి దళితబంధు ఇవ్వలేదన్నారు. అభివృద్ధికి సహకరించకపోయినా అభివృద్ధికి నిరంతరం తపిస్తున్నానన్నారు. నార్సింగిలో ఆస్పత్రి విస్తరణకు కృషి చేశానన్నారు.

లారీల ట్రాకింగ్‌కు కొత్తగా యాప్

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

మెదక్ కలెక్టరేట్: వరి ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ ఐకేపీ ఏపీఎం, సీసీలకు సూచించారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏపీఎం, సీసీలతో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోళ్లకు అనుగుణంగా లారీలు కేటాయిస్తామన్నారు. అలాగే గోనె సంచుల అవసరాలకు సంబంధించి వాట్సాప్ ద్వారా ఇండెంట్ పంపించాలన్నారు. అవసరాన్ని బట్టి 24 నుంచి 48 గంటల్లో గోనె సంచులు సరఫరా చేస్తామని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ హరికృష్ణ తెలిపారు. ఈసారి కొత్తగా లారీల ట్రాకింగ్ కోసం యాప్‌ను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీఓ, సివిల్ సప్లయ్ డీఎం, డీఎస్ఓ, డీపీఎం మోహన్, ప్రకాష్ కెనడీ, మెర్సినా, శ్రీనిధి రీజనల్ మేనేజర్ గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం



ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్రచార రథాన్ని ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ ఓటు హక్కు వినియోగం, నూతన ఓటరు పద్ధతులు, వసతుల కల్పన, ఎన్నికల నియమావళి ప్రకారం ఎలా నడుచుకోవాలి అనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

వందశాతం పోలింగే లక్ష్యం
- చైతన్య రథంతో ఓటర్లకు అవగాహన
- జిల్లాలో 44 రోజులపాటు నిర్వహణ
- కళాకారుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో విస్తృత ప్రచారం

మెదక్: జిల్లాలో మెదక్, నర్సాపూర్ రెండు నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 4,34,275 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 579 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. నవంబర్ 30న జరుగబోయే శాసనసభ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ నమోదయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందు కోసం ఎన్నికల ప్రచార రథాన్ని ఏర్పాటు చేయగా, 17న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాజర్షిషా జెండా ఊపి ప్రారంభించారు. ఇప్పటికే మెదక్, నర్సాపూర్ నియోజకవర్గానికొక వాహనాన్ని ఏర్పాటు చేసి ఓటుపై విస్తృతంగా అవగాహన కల్పించడంతోపాటు డిగ్రీ కళాశాలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో జిల్లా స్థాయి అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కొత్తవి 15 వేల పై చిలుకు..

ఈసారి ఎప్పుడూ లేని విధంగా 15 వేల పైచిలుకు యువత నూతనంగా ఓటు నమోదు చేసుకున్నారు. కొత్త వారితోపాటు ఓటు హక్కు ఉన్న ప్రతీ వ్యక్తి ఓటును వినియోగించుకొని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. 31వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునే విధంగా ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.



ఆటపాటలతో ప్రజలను చైతన్యం..

'నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో ప్రజలు అందరూ ఓటింగ్‌లో భాగస్వామ్యం కావాలని జిల్లా యంత్రాంగం పకడ్బందీగా చర్యలు చేపట్టింది. సాంస్కృతిక శాఖ కళాకారులతో నెలన్నరపాటు జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ఆటపాటలతో ప్రజలను చైతన్యం చేసే దిశగా శ్రీకారం చుట్టారు. ప్రధానంగా పట్టణాలు, మండల కేంద్రాలు, మున్సిపాలిటీలు, ప్రధాన కూడళ్లు, మార్కెట్లు, బస్ స్టాండ్ లు, షాపింగ్ మాల్స్‌లతోపాటు గిరిజన తండాల్లో విస్తృత ప్రచారం చేయనున్నారు.

ఫిర్యాదులకు 1950 నంబర్

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎన్నికలు సజావుగా సాగేందుకు జిల్లా యంత్రాంగం గట్టి నిఘా ఏర్పాటు చేసింది. ముఖ్యంగా ఓటర్లకు డబ్బు, మద్యం, కానుకలు పంపిణీ చేసి ప్రలోభాలకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే 1950 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

ఓ వైపు ఏర్పాట్లు చేస్తూనే...

జిల్లా యంత్రాంగం ఓ వైపు ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తూనే మరోవైపు ప్రచారం నిర్వహిస్తోంది. మొత్తం పోలింగ్ బూతుల్లో అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తున్నారు. ముఖ్యంగా దివ్యాంగులకు ర్యాంపులు, వీల్‌చైర్ల ఏర్పాటు, మరుగుదొడ్ల సౌకర్యం, శామియాలు, విద్యుత్ సౌకర్యం, తదితర ఏర్పాట్లను చేస్తోంది.



భక్తులకు దర్శనమిస్తున్న ఏడుపాయల దుర్గమ్మ

కూష్మాండ అలంకరణలో దుర్గమ్మ

పాపన్నపేట(మెదక్): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడుపాయల దుర్గమ్మ బుధవారం కూష్మాండ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పూజారులు అమ్మవారిని ఆకుపచ్చ వస్త్రాలతో అలంకరించారు. వేద బ్రహ్మణులు సనాతన శర్మ వేద మంత్రాలతో దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్ రెడ్డి, ధర్మకర్తలు, భక్తులు పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆర్య వైశ్య యువజన సంఘ సభ్యులు నిర్వహిస్తున్న ఉచిత అన్నదానాన్ని స్వీకరించారు.

బీఫామ్ ఇచ్చేదాకా ఆగుతా..



అనుచరులతో సమావేశమైన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

- ముఖ్య అనుచరులతో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమావేశాలు

నర్సాపూర్: నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి బుధవారం తన ముఖ్య అనుచరులతో రెండు చోట్ల సమావేశమయ్యారు. టికెట్ రాకపోతే ఇతర పార్టీలో చేరి పోటీలో ఉండాలని, లేదా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగాలని ముఖ్య అనుచరులు ఎమ్మెల్యేపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. నర్సాపూర్ బీఆర్ఎస్ టికెట్‌ను పార్టీ అధిష్టానం ఇంకా అధికారికంగా ప్రకటించకుండా సస్పెన్స్‌లో పెట్టడంతో ఎమ్మెల్యే తన అనుచరులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. నర్సాపూర్ బీఆర్ఎస్ టికెట్‌ను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి ఇచ్చేందుకు సీఎం కేసీఆర్ నిర్ణయించిన విషయాన్ని మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు గత నెల 30న మదన్‌రెడ్డిని ప్రగతిభవన్‌కు పిలిచి చెప్పిన విషయం తెలిసిందే. అలాగే, ఈ నెల16న సైతం సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని ప్రగతి భవన్‌కు పిలిపించుకొని ఇదే విషయాన్ని చెప్పారని, ఎన్నికల అనంతరం ఆయనకు సముచిత స్థానం కల్పిస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి. బుధవారం ఉదయం ఓ బీఆర్ఎస్ నాయకుడి గెస్ట్ హౌస్‌లో హత్నూర, చిలిపిచెడ్, నర్సాపూర్ మండలాల్లోని ఎమ్మెల్యే అనుచరులు ఆయనతో సమావేశమయ్యారు. టికెట్ రాని పక్షంలో పార్టీకి రాజీనామా చేసి ఇతర (కాంగ్రెస్) పార్టీలో చేరి లేదా స్వతంత్రంగానైనా బరిలో ఉండాలని పలువురు నాయకులు ఎమ్మెల్యేపై ఒత్తిడి చేసినట్లు తెలిసింది. సునీతారెడ్డిని ఓడించాలన్నారు. అలాగే, కొడిపల్లి, శివ్వంపేట మండలాల్లోని పలువురు నాయకులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిశారని తెలిసింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నర్సాపూర్ టికెట్ సునీతారెడ్డికే ఇవ్వాలని పార్టీ అధిష్టానం నిర్ణయించిందని, ఎన్నికల నామినేషన్లు దాఖలు చేసే చివరి నిమిషంలో సైతం అభ్యర్థుల మార్పు చేసే ఘటనలు చోటు చేసుకుంటాయని, అందుకే తన వంతు గట్టిగా ప్రయత్నిస్తున్నానని తెలిపారు. తనకు బీఫామ్ ఇవ్వని పక్షంలో ముఖ్య అనుచరులతో సమావేశం పెట్టి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయం తీసుకుంటానని పేర్కొన్నారు. బీఫామ్ ఇవ్వక ముందే పార్టీకి రాజీనామా చేస్తే చెడ్డపేరు వస్తుందని అన్నారు.

21 నుంచి పోలీస్ అమరుల సంస్మరణ కార్యక్రమాలు

- మూడు భాషల్లో ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ రోహిణీప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవమైన పోలీస్ ఫ్లాగ్‌డే, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిలను పురస్కరించుకొని ఈనెల 21 నుంచి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ రోహిణీప్రియదర్శిని తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసు విధులు, త్యాగాలు, సాంకేతిక వినియోగం, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా మూడు భాషల్లో (తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ) పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 24 వరకు అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలన్నారు. పోలీసులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు, యువతకు, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు, వీడియో గ్రాఫర్లకు షార్ట్ ఫిలిమ్స్, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రధాన కూడళ్ల వద్ద పోలీస్ అమరవీరుల బ్యానర్లను ఏర్పాటు చేస్తామన్నారు. మొదటిరోజు జిల్లా నూతన పోలీస్ కార్యాలయం ఎదుట పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తూ 'స్మృతీ పరేడ్', 'పోలీస్ ఫ్లాగ్ డే' నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాటల మనిషిని కాదు.. చేతల మనిషిని




కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే హన్మంతరావు

- మల్కాజిగిరి ఎమ్మెల్యే హన్మంతరావు

రామాయంపేట(మెదక్):అధికారంలోని గల్లీ స్థాయి నుంచి పెద్ద స్థాయి బీఆర్ఎస్ నాయకులు కొనుగోళ్లు మొదలు పెట్టారని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆరోపించారు. బుధవారం నార్సింగి మండలంలోని జప్తి శివునూర్‌లో తన కుమారుడు, మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు పని గట్టుకొని తనపై ఆరోపణలు చేస్తున్నారని, తాను మాటల మనిషిని కాదని, చేతల మనిషినని అన్నారు. ప్రతీ గ్రామంలో తాను వేసిన బోర్లు, ట్యాంకులు ఉన్నాయన్నారు. అధికార పార్టీ వారు చేస్తున్న ఖర్చు ప్రజల డబ్బు అని, ప్రజల నుంచి దోచుకున్న డబ్బును ఖర్చు పెడుతున్నారని ఆరోపించారు. బీసీబంధు, దళితబంధు, తదితర పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అలాగే, గ్రామానికి చెందిన ఇతర పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారినా.. కేడర్ మారేనా..!

- పార్టీలు మారుతున్న వారిని ప్రజలు నమ్ముతారా..?
- మద్దతు తెలిపినా.. ఓటు వేస్తారా అనే సందేహం



హవేళిఘణపూర్ (మెదక్): వ్యక్తిగత అవసరాలు.. పార్టీల్లో సరైన ప్రాధాన్యత లేదని పార్టీలు మారుతున్న నాయకులు వారు మారినా తమకున్న కేడర్‌ను మెప్పించగలుగుతారా అన్నది.. ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో దూకుడు పెంచిన పార్టీల నాయకులు పథకాల పేరుతో ఒక్కొక్కరిని తమ పార్టీలో చేర్చుకోవడం మొదలుపెట్టారు. గతంలో ఎడమొఖం పెడమొఖంగా ఉన్న పలు పార్టీల నాయకులు సైతం అధిష్టానం సూచనలతో కలిసి పని చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. గతంలో కంటే ఈసారి ఎన్నికలు నువ్వా.. నేనా.. అన్నట్లుగా పోటాపోటీగా ఉండడంతో పేరున్న నాయకులను పలకరింపులతో ఫిదా చేస్తున్నారు.

చేరికలు పనికొచ్చేనా..?

గ్రామాల్లో ఇన్ని రోజులు వారి వెంట తిరిగే వ్యక్తులను తప్ప మిగతా ఎవరిని పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు అన్ని పార్టీల నాయకులు కుల సంఘాల పెద్దలను, మహిళా లీడర్లతో మాట్లాడి ఏం కావాలో చెప్పండి.. వీలైతే ఇప్పుడే చేస్తాం.. లేకుంటే గెలిచినా వెంటనే పనులు చేసి పెడుతామంటూ హామీలిచ్చి పార్టీ కండువాలు కప్పుతున్నారు. ఉదయం ఒక పార్టీలో చేరిన వారు సాయంత్రానికి మరో పార్టీలో చేరుతున్నారు. పూటకో పార్టీ మారుతున్న నాయకులు ఇచ్చిన మాట ప్రకారం ఓటు వేస్తారా..? లేదా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజలు కూడా ఎవరిని నిరాశ పర్చకుండా అందరికీ మద్దతు తెలుపుతున్నారు. చివరకు ఎవరికి ఓటు వేస్తారనేది తెలియడం లేదు. ఓటరు నాడిని గుర్తించడం ఈ ఎన్నికల్లో అంతా సులువుగా కనిపించడం లేదు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితిపై అవగాహన పెరగడంతో వారికి నచ్చిన వారికే ఓటు వేస్తారన్నది నమ్మలేని నిజం.

సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి

- అనవసర పోస్టులు పెడితే కఠిన చర్యలు
- ఎన్నికలు పారదర్శకంగా జరగాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా ఎంసీఎంసీ అధికారులకు సూచించారు. బుధవారం ఎస్పీ రోహిణీప్రియదర్శిని, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ సెంటర్ (ఎంసీఎంసీ)ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి అధికారులు మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో ఎంసీఎంసీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టులపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పెయిడ్ ఆర్టికల్‌ను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం చేయాలని తెలిపారు. అలాగే సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటనలకు వంటివి సకాలంలో ఆమోదిస్తూ, మంజూరు చేయాలని సూచించారు.

మౌలిక వసతులు కల్పించండి

అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 30లోగా అన్ని వసతులు కల్పించాలని జిల్లా అధికారులను కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులతో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రమేశ్, డీఆర్ఓ పద్మశ్రీ, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

మాతృ మరణాలను నివారించాలి

జిల్లాలో మాతృ మరణాలను నివారించాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. తన చాంబర్‌లో మాతృ మరణాల నివారణ కమిటీ సమావేశం నిర్వహించారు. మాతృ మరణాలు జరగడానికి గల కారణాలు, నివారణ చర్యల గురించి చర్చించారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎమ్‌లు హైరిస్క్ కేసులను గుర్తించి త్వరగా ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ చందు నాయక్, వైద్యాధికారులు విజయ నిర్మల, మాధురి, శివ దయాల్, అమర్ సింగ్, రాజేష్ కుమార్, నవీన్ కుమార్, బ్రహ్మాజీ, అనీలా, అరుణశ్రీ, అనిల్, రమేశ్, ప్రవీణ్ కుమార్, వినయ్ సుశీల్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా రోహిణీప్రియదర్శిని, వెంకటేశ్వర్లు

ఆయుధాలు ఉన్న వారి వివరాలు సేకరణ

ఆయుధాల లైసెన్సులు కలిగిన వారి వివరాల సేకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ రోహిణీప్రియదర్శినితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా జిల్లాలో లైసెన్స్‌తో కూడిన ఆయుధాలు ఉన్న వారి వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఉచిత మద్యపానం సరఫరా, వాహనాల్లో వివిధ రకాల వస్తుల రవాణాపై నిఘా పెట్టాలని తెలిపారు. బ్యాంకుల్లో రూ.10 లక్షల కంటే పైన డిపాజిట్ అయితే వారి వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సీటీఓ మహేందర్ రెడ్డి, ఆర్డీఓ రిచర్డ్ ముత్తు, అదనపు ఎస్పీ మహేందర్ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనే శ్రీరామ రక్ష

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: అభివృద్ధి, సంక్షేమాన్ని కొత్త పుంతలు తొక్కించిన సీఎం కేసీఆర్ పాలనే శ్రీరామ రక్ష అని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో జెడ్పీటీసీ మల్లేశం ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆర్ఎంపీ, పీఎంపీలు కేసీఆర్‌కు మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేశారు. ఈ మేరకు తీర్మాన కాపీలను ఎమ్మెల్సీ, ఎఫ్‌డీసీ చైర్మన్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డిలు మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న స్వరాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చడానికి కేసీఆర్ కృషి చేస్తున్నారని చెప్పారు. వ్యవసాయరంగంలోనే కాదు, అన్ని రంగాల్లో తెలంగాణ నేడు అగ్రగామిగా ఆవిర్భవించిందని అన్నారు. కేసీఆర్‌కు మద్దతు ప్రకటించిన ఆర్ఎంపీ, పీఎంపీలను అభినందించారు.

భారీ మెజారిటీతో గెలిపిద్దాం

ములుగు(గజ్వేల్): గజ్వేల్ నియోజకవర్గనుంచి మూడో సారి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలుపించుకుందామని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్ రెడ్డిలు పిలుపునిచ్చారు. ములుగులో బుధవారం నిర్వహించిన మండల స్థాయి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు సలీం, పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి, వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో డ్రైవర్‌కు 10 ఏళ్లు జైలు

2017లో మహిళపై లైంగిక దాడి కేసు

పటాన్‌చెరు టౌన్‌: ఆటోలో వెళ్తుండగా మహిళపై లైంగిక దాడికి పాల్పడిన ఆటోడ్రైవర్‌కు న్యాయస్థానం పదేళ్లు జైలుశిక్ష విధించింది. సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్‌ బుధవారం విలేకరులకు వివరాలు తెలిపారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందని ఓ మహిళ 2017 అక్టోబర్‌, 17 రాత్రి పటాన్‌చెరు నుంచి ఆటోలో తన స్వగ్రామానికి వెళ్తుండగా స్థానిక అంబేడ్కర్‌ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్‌ అశోక్‌ మార్గమధ్యంలో మహిళపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు అప్పట్లో పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పటి డీఎస్పీ సీతారాం, సీఐ ప్రభాకర్‌, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి విచారణ నిర్వహించి నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని సంగారెడ్డి కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి సునీత రవీంద్రరెడ్డి నిందితుడికి పది సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు. నేరస్తులకు శిక్ష పడినప్పుడే ప్రజలలో పోలీసులపై నమ్మకం పెరుగుతుందని ఎస్పీ అన్నారు.

మరణించినా ఇద్దరికి చూపు


కార్నియాలను సేకరిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

హుస్నాబాద్‌: స్థానిక రిటైర్డ్‌ మున్సిపల్‌ కమిషనర్‌ గుండోజు శంకర్‌(81) మరణించినా ఇద్దరికి చూపునిచ్చారు. శంకర్‌ నేత్రాలు ఇద్దరు అంధులకు చూపునిస్తాయని తెలంగాణ నేత్ర, అవయవ దాతల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజమల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ కొమురయ్య అన్నారు. రిటైర్డ్‌ మున్సిపల్‌ కమిషనర్‌ గుండోజు శంకర్‌ బుధవారం ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు శంకర్‌ నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. దీంతో ఎల్వీ ప్రసాద్‌ వరంగల్‌ కంటి ఆస్పత్రి సిబ్బంది వచ్చి శంకర్‌ కార్నియాలను సేకరించారు. ఈ సందర్భంగా బూట్ల రాజమల్లయ్య, కొమురయ్య శంకర్‌ కుటుంబ సభ్యులను అభినందించారు. స్ఫూర్తి అసోసియేషన్‌ అధ్యక్షుడు పందిల్ల శంకర్‌, సంఘ నాయకులు మల్లారెడ్డి, శంకర్‌రావు, రాజేందర్‌ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో పూడూరు మండలం మిర్జాపూర్‌ గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చాలా మంది పార్టీలో చేరుతున్నారని తెలిపారు. తెలంగాణ పథకాలు ఏ రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ హ్యాట్రిక్‌ సాధించడం ఖాయమన్నారు.

మూడు ముక్కలాట!

- దుబ్బాక కాంగ్రెస్‌లో ఆది నుంచి విభేదాలకు కేరాఫ్‌ అడ్రస్‌
- టికెట్‌ కోసం త్రిముఖపోటీ
- ఎవరికి వారు ప్రచారం ముమ్మరం


చెరుకు శ్రీనివాస్‌రెడ్డి


శ్రావణ్‌కుమార్‌రెడ్డి


కత్తి కార్తీక

దుబ్బాకటౌన్‌: దుబ్బాక నియోజకవర్గం మొదటి నుంచి కాంగ్రెస్‌ పార్టీలో గ్రూపు విభేదాలకు కేరాఫ్‌ అడ్రస్‌గా మారింది. పాతతరం మారినా గ్రూపుల లొల్లి మారడంలేదు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌ పార్టీకి ప్రజల్లో ఆదరణ ఉన్నప్పటికీ గ్రూపు రాజకీయాల వల్ల ప్రతిసారి పరాభవం ఎదుర్కొంటుందని పలువురు నేతలు అంటున్నారు. మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి తనయుడు శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్‌ పన్యాల శ్రావణ్‌కుమార్‌ రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి కత్తి కార్తీక గ్రూపుల మధ్యన పచ్చి గడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో విభేదాలు చోటుచేసుకుంటున్నాయి.

అధిష్టానానికి తలనొప్పిగా..

ఈ నేపథ్యంలో దుబ్బాక టికెట్‌ కేటాయింపు కాంగ్రెస్‌ పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా తయారైంది. అయితే ప్రజల్లో ఏ నాయకుడికి ఆదరణ ఉందన్న దానిపై అధిష్టానం ఇప్పటికే సర్వే చేయించిందని, ఆ సర్వే ఆధారంగానే టికెట్‌ కేటాయించాలని నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. కానీ ఆ ముగ్గురు నేతలూ మాత్రం తమకే టికెట్‌ వస్తుందని తమ అనుచరులతో సమావేశాలు నిర్వహిస్తూ గ్రామాల్లో హడావుడి చేస్తున్నారు. 2020లో జరిగిన దుబ్బాక ఉప ఎన్నికల్లో చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి టికెట్‌ కేటాయించగా.. పోటీ మాత్రం బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు, బీఆర్‌ఎస్‌ సోలిపేట సుజాత మధ్యనే నడిచి చివరకు వెయ్యికి పైగా ఓట్లతో బీజేపీ గెలుపొందడం తెలిసిందే.

టికెట్‌ కోసం త్రిముఖ పోటీ

దుబ్బాక కాంగ్రెస్‌ పార్టీ టికెట్‌ కోసం చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, కత్తి కార్తీకతో పాటు పీసీసీ సీనియర్‌ నాయకుడు మద్దుల సోమేశ్వర్‌రెడ్డి తనయుడు గాల్‌రెడ్డి దరఖాస్తులు చేసుకున్నారు. శ్రీనివాస్‌రెడ్డి, శ్రావణ్‌, కార్తీక కొన్ని నెలలుగా తమకే టికెట్‌ వస్తుందంటూ ఎవరికి వారు తమ అనుచరులతో గ్రామాల్లో పర్యటిస్తూ ధీమాగా ఉన్నారు. పోటాపోటీగా కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో క్యాడర్‌లో అయోమయం నెలకొంది. ముగ్గురిలో ఎవరికి టికెట్‌ వచ్చినా మిగతా ఇద్దరు సహకరిస్తారా అన్నది పెద్ద ప్రశ్నగా మిగిలింది.

చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ప్రచారం

పరిస్థితి అలా ఉంటే చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి 106 రోజులుగా నియోజకవర్గంలో ఆత్మగౌరవ యాత్ర చేపడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పర్యటిస్తున్నారు. ఇటీవల నాలుగైదు రోజుల నుంచి ఏకంగా ప్రచారం మొదలుపెట్టారు. చేతి గుర్తుకు ఓటు వేయాలని, కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెబుతున్నారు. ఈ ప్రచారం చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనా దుబ్బాక కాంగ్రెస్‌ టికెట్‌ ముగ్గురిలో ఎవరిని వరిస్తుందో అన్నది రెండు మూడు రోజుల్లో తేలిపోనుంది.

జంగ్‌ తెలంగాణ


జోగిపేటలో గ్యారంటీ పథకాలపై మహిళలకు వివరిస్తున్న దామోదర

దోపిడీ పాలనకు చరమగీతం

ప్రజలకు అందోల్‌ కాంగ్రెస్‌ అభ్యర్థి దామోదర పిలుపు

వట్‌పల్లి (అందోల్‌): పదేళ్ల బీఆర్‌ఎస్‌ దోపిడీ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని అందోల్‌ కాంగ్రెస్‌ అభ్యర్థి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. బుధవారం జోగిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్‌ ప్రభంజనం కొనసాగుతోందని, వచ్చేది తమ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. తమ మేనిఫెస్టోను బీఆర్‌ఎస్‌ కాపీ కొట్టిందని విమర్శించారు. ప్రజలు తమ పార్టీ వైపు చూస్తున్నారని, ప్రజాదరణను చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్‌ నాయకులు కాంగ్రెస్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. అసంతృప్తితో ఉన్న సీనియర్‌ నాయకులతో హైకమాండ్‌ మాట్లాడి సమయోచిత నిర్ణయం తీసుకుంటుందన్నారు. అనంతరం జోగిపేటకు చెందిన వడ్డెర కుల సంఘం సభ్యులు, పుల్కల్‌ మండలం పెద్దారెడ్డిపేట్‌కు చెందిన యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో అందోలు–జోగిపేట మున్సిపల్‌ కౌన్సిలర్లు ఎస్‌.సురేందర్‌గౌడ్‌, రంగ సురేష్‌, ఆకుల చిట్టిబాబు, డాకూరి శివశంకర్‌, పి.రేఖ ప్రవీణ్‌, హరి కృష్ణాగౌడ్‌, మాజీ ఎంపీటీసీ డాకూరి వెంకటేశం, సొసైటీ మాజీ వైస్‌ చైర్మన్‌ సత్యవ్రత్‌, మాజీ కౌన్సిలర్‌ గొల్ల శరత్‌బాబు, నాయకులు శ్రీనివాస్‌ గౌడ్‌, సడిగె రవి, ఉల్వాల రాజు, డాకూరి శ్రీనివాస్‌, ఉల్వాల సతీష్‌, సడిగె శ్రీనివాస్‌, కొణికె రాజశేఖర్‌, చిట్యాల మధు, ఖాజా, రాములు పాల్గొన్నారు.

రూ.1.37 లక్షల మద్యం స్వాధీనం


పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

హవేళిఘణాపూర్‌(మెదక్‌): కిరాణ దుకాణంపై దాడులు నిర్వహించి రూ.1.37 లక్షల విలువచేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని హవేళిఘణాపూర్‌ ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్‌ తెలిపారు. గాజిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇల్టెం రాములు బూర్గుపల్లి గ్రామంలో కిరాణ దుకాణం కొనసాగిస్తూ మద్యం విక్రయిస్తున్నాడు. బుధవారం అందిన సమాచారం మేరకు దాడిచేసి మూడు బీరు కేట్లను, 22 రకాల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచినవారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



చిత్తా.. బొత్తా..?



- తేలని కాంగ్రెస్‌, సీపీఐ పొత్తు వ్యవహారం
- హుస్నాబాద్‌లో పొత్తులు.. సీట్లపై ఇరు పార్టీల మల్లగుల్లాలు

హుస్నాబాద్‌: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌ అంటేనే మొదటి నుంచి పొత్తుల సంసారం. ఇప్పటి వరకు పొత్తులు లేకుండా ఎన్నికలు జరగలేదు. ఇందుర్తి నియోజకవర్గం ఉన్న సమయంలో కాంగ్రెస్‌, టీడీపీ, సీపీఐ మధ్య పోటీ తీవ్రంగా ఉండేది. కానీ ఓటర్లు మాత్రం విచిత్రంగా తీర్పిచ్చేవారు. అధికార పార్టీకి కాక ప్రతిపక్ష పార్టీ అభ్యర్థికి పట్టంకట్టేవారు. నియోజకవర్గంలో ఐదు సార్లు సీపీఐ గెలిచి కంచుకోటగా చేసుకుంది. నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా ఇందుర్తి నుంచి హుస్నాబాద్‌ నియోజకవర్గంగా ఆవిర్భవించడంతో 2009 నుంచి 2018 ఎన్నికల వరకు ఒక్కసారి కాంగ్రెస్‌, రెండు సార్లు బీఆర్‌ఎస్‌ విజయం సాధించాయి.

పొత్తు, సీట్ల కేటాయింపులో మల్లగుల్లాలు

ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్‌, సీపీఐ పొత్తు విషయం, కేటాయింపులో రెండు పార్టీల నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ అయోమయ స్థితిలో అభ్యర్థులను ప్రకటించలేని దుస్థితి నెలకొంది. పొత్తులో భాగంగా హుస్నాబాద్‌ సీటును సీపీఐ నుంచి మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి టికెట్‌ను ఆశిస్తుండగా, కాంగ్రెస్‌ నుంచి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌ రెడ్డి టికెట్‌ కోసం బరిలో ఉన్నారు. రెండు పార్టీల అధిష్టానాలు పొత్తులు, సీట్ల విషయంలో కసరత్తుతో కాలయాపన చేస్తుండటంతో ఆశావాహుల మధ్య గందరగోళం నెలకొంది. సీపీఐ అభ్యర్థి చాడ వెంకట్‌రెడ్డి కేవలం ప్రెస్‌మీట్‌లతోనే సరిపుచ్చుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

సీఎం సభతో గులాబీ శ్రేణుల్లో జోష్‌

మరో వైపు బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థిగా సిట్టింగ్‌ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ పేరును అధిష్టానం ప్రకటించింది. 15న హుస్నాబాద్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్‌ సతీష్‌కుమార్‌కు బీఫాం కూడా అందజేశారు. దాదాపు నెల రోజుల నుంచి సతీష్‌కుమార్‌ సుడిగాలి పర్యటనతో గ్రామాలను చుడుతూ ప్రచారంలో దూకుడు పెంచారు. ఆశీర్వాదసభ సక్సెస్‌ అవడంతో గులాబీ శ్రేణుల్లో జోష్‌ పెరిగింది. తనకు పోటీగా ఎవరు వచ్చినా పర్వాలేదన్నట్లుగా ఆత్మీయసభలతో సతీష్‌కుమార్‌ ప్రచారం ఉధృతం చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో రెండు గ్రూపులు

కాంగ్రెస్‌ టికెట్‌ను ఆశిస్తున్న పొన్నం ప్రభాకర్‌, ప్రవీణ్‌రెడ్డి ఎవరికి వారు టికెట్‌ తమకే దక్కుతుందనే ధీమాతో పోటాపోటీగా ప్రచారం చేసుకుంటున్నారు. ప్రవీణ్‌ రెడ్డి ఇప్పటికే దాదాపు 90 గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్‌ చేసిన అభివృద్ధిని చెబుతూ ప్రచారం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాహుల్‌గాంధీ బహిరంగ సభకు ఎవరికి వారే వాహనాలను సమకూర్చి కార్యకర్తలను తరలించారు. గత నెల 18న కాంగ్రెస్‌ ఆరు గ్యారంటీ పథకాల ప్రచారంలో భాగంగా హుస్నాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరైన సీడబ్ల్యూసీ సభ్యుడు మోహన్‌ ప్రకాష్‌ను స్వాగతించే క్రమంలో పొన్నం, అలిగిరెడ్డి వర్గీయులు బాహాబాహీకి దిగారు. అప్పటి నుంచి కాంగ్రెస్‌ పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయింది. ఇద్దరు వేర్వేరుగా పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేసుకున్నారు. పొన్నం ప్రభాకర్‌ కొద్ది రోజుల నుంచి హుస్నాబాద్‌లోనే మకాం వేసి అవకాశం వచ్చినప్పుడల్లా ప్రెస్‌మీట్లు పెట్టి బీఆర్‌ఎస్‌, బీజేపీలపై విరుచుకుపడుతున్నారు. పొన్నం మార్నింగ్‌ వాక్‌ పేరిట హుస్నాబాద్‌ పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటిస్తూ గ్యారంటీ కార్డులను ఇస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. మరోవైపు ప్రవీణ్‌ రెడ్డి సైతం గ్రామాల్లో పర్యటిస్తూ తనదైన శైలిలో ఓటర్లను ఆకట్టుకునే పనిపడ్డారు. పొత్తులో భాగంగా హుస్నాబాద్‌ సీటు కాంగ్రెస్‌కు వస్తుందా లేదా సీపీఐకి పోతుందా అనే ఉత్కంఠ కొనసాగుతోంది. ఒకవేళ కాంగ్రెస్‌కే వస్తే హుస్నాబాద్‌ టికెట్‌ పొన్నం ప్రభాకర్‌కా?, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికా? అనేది సస్పెన్స్‌గా మారింది.

మా మేనిఫెస్టోను కాపీ కొట్టారు

జహీరాబాద్‌ కాంగ్రెస్‌ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్‌ ధ్వజం


మాట్లాడుతున్న ఎ.చంద్రశేఖర్‌

ఝరాసంగం(జహీరాబాద్‌): కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల మేనిఫెస్టోను బీఆర్‌ఎస్‌ కాపీ కొట్టిందని జహీరాబాద్‌ కాంగ్రెస్‌ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్‌ విమర్శించారు. వస్తున్నా.. మీకోసంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని చీల మామిడి, జీర్లపల్లి, జునేగావ్‌, ఇస్లాంపూర్‌, ఏడాకులపల్లి, చిలకపల్లి, గినియార్‌ పల్లి, ఈదులపల్లి, దేవరంపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ముఖ్యమంత్రి కేసీఆర్‌ బాగున్నట్లు ప్రత్యక్షంగా ఒప్పుకున్నట్లయిందని తెలిపారు. బీఆర్‌ఎస్‌ హయాంలో సొంత పార్టీ కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలు అందించారని విమర్శించారు. కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం వర్తించే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. నిరుద్యోగులను అంధకారంలో నెట్టేసిన ఘనత కేసీఆర్కే దక్కిందన్నారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్‌ చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కాంగ్రెస్‌కు అధికారం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాగా, ఆయా గ్రామాల్లోని బీఆర్‌ఎస్‌ పార్టీ వార్డు మెంబర్లు కాంగ్రెస్‌ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో జహీరాబాద్‌ పార్లమెంట్‌ ఇన్‌చార్జి ఉజ్వల్‌ రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌ రావు పాటిల్‌, ఎంపీపీ దేవదాసు, వైస్‌ ఎంపీపీ మల్లన్న పాటిల్‌, ఎంపీటీసీలు శంకర్‌ పాటిల్‌, శకుంతల, సర్పంచ్‌ రాంరెడ్డి, విజయలక్ష్మి, యువజన కాంగ్రెస్‌ పార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌ శంకర్‌ పాటిల్‌ తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై విహరించిన పద్మనాభుడు


శేష వాహనంపై విహరిస్తున్న స్వామివారు


హంస వాహనంపై విహరిస్తున్న వేంకటేశ్వరస్వామి

అనంతగిరి: దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలంపల్లి అనంత పద్మనాభస్వామి బుధవారం రాత్రి శేష వాహనంపై విహరించారు. ఆలయ మడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

హంస వాహన సేవలో శ్రీవారు

వికారాబాద్‌ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి స్వామివారు హంస వాహనంపై విహరించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 11 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య


నర్సింలు (ఫైల్‌)

కొండపాక(గజ్వేల్‌): కుటుంబ కలహాలతో ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొడిగ నర్సింలు (40) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. 13 ఏళ్ల కిందట కుటుంబ కలహాలతో ఆయన భార్య ఆత్మ హత్య చేసుకుంది. దీంతో 8 ఏళ్ళ కిందట రెండో వివాహం చేసుకున్నాడు. ఇటీవల రెండో భార్యతో గొడవలు జరుగుతుండడం, వ్యవసాయం కోసం చేసిన అప్పుల కోసం మధనపడుతుండేవాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ప్రాణం తీసిన ఎక్కిళ్లు


సాయిలు (ఫైల్‌)

కల్హేర్‌(నారాయణఖేడ్‌): ఎక్కిళ్లు ఓ ట్రాక్టర్‌ డ్రైవర్‌ను బలితీసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా కల్హేర్‌ మండలం ఖానాపూర్‌(కె)లో చోటుచేసుకుంది. గ్రామనికి చెందిన సర్వ సాయిలు(39) పంచాయతీలో ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి భోజనం చేశాక అకస్మాత్తుగా ఎక్కిళ్లు మొదలయ్యాయి. తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ఈలోగా సాయిలు మృతిచెందాడు. ఎక్కిళ్లు రావడంతో గుండెపోటుకు గురైనట్టు 108 సిబ్బంది తెలిపారు. ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

మనూరులో చిరుత కలకలం

మనూరు(నారాయణఖేడ్‌): మనూరు మండల పరిధిలోని దుదగొండ, బోరంచ అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తుందని స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా రేగోడ్‌ మండలం పోచారం, నారాయణఖేడ్‌ మండలం రుద్రారం, మనూరు మండలం దుదగొండ, బోరంచ గ్రామ శివారులోను చిరుత సంచరిస్తుందని స్థానికులు చెప్పారు. దుదగొండ శివారులో చిరుత సంచరించడం చూసి భయంతో పారిపోయామని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. నారాయణఖేడ్‌ ఫారెస్టు రేంజ్‌ అధికారి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా చిరుత సంచారం విషయం తమ దృష్టికి వచ్చిందని, సిబ్బందిని అలెర్ట్‌ చేసి ఆయా గ్రామాల సర్పంచ్‌లను అప్రమత్తం చేశామని చెప్పారు. గొర్రెలు, మేకల పెంపకందారులు అప్రమతంగా ఉండాలని సూచించారు.

చిరుత సంచారం

అల్లాదుర్గం(మెదక్‌): అల్లాదుర్గం శివారులో బుధవారం అల్లాదుర్గం రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలోని గుట్టపై చిరుత పులిని చూసినట్లు స్థానికులు తెలిపారు. అల్లాదుర్గం, కాయిదంపల్లి, రెడ్డిపల్లి, వెంకట్‌రావుపేట, అప్పాజీపల్లి గ్రామాలు అటవీ ప్రాంతంలో ఉండడంతో పులి సంచరిస్తుందని సాయంత్రం పొలాలకు వెళ్లాలంటే రైతులు, పశువుల కాపరులు భయాందోళనకు గురవు తున్నారు. అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టి, పులి సంచారంపై ప్రకటన చేయాలని కోరారు. గతంలో కాయిదంపల్లి శివారులో పులి దూడను చంపి తిన్న విషయం తెలిసిందే.


గోల్కొండ ఫోర్ట్‌ వద్ద కేడెట్లు

కేడెట్ల క్షేత్ర పరిశోధన

గజ్వేల్‌రూరల్‌: స్థానిక బాలుర ఎడ్యుకేషన్‌ హబ్‌ ఆవరణలో జరుగుతున్న స్పెషల్‌ నేషనల్‌ ఇంటిగ్రేషన్‌ క్యాంప్‌లో భాగంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కేడెట్లు క్షేత్ర పర్యటనలో పాల్గొన్నారు. బుధవారం హైద్రాబాద్‌లోని గోల్కొండ కోట, ఆర్టిలరీని సందర్శించారని క్యాంపు శిక్షణాధికారి లెఫ్టినెంట్‌ కల్నల్‌ పినాకి తెలిపారు. అలాగే వారికి ఫైరింగ్‌ శిక్షణ ఇచ్చినట్టు క్యాంపు కమాండెంట్‌ లెఫ్టినెంట్‌ మధుసూదన్‌రావు తెలిపారు. సెమీ ఫైనల్‌ వాలీబాల్‌ పోటీలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌, ఢిల్లీ జట్లు గెలుపొంది ఫైనల్‌ మ్యాచ్‌కు ఎంపికైనట్టు క్రీడాధికారి లెఫ్టినెంట్‌ కల్నల్‌ రాకేష్‌ జైశ్వాల్‌ చెప్పారు. 17 డైరెక్టరేట్‌లకు చెందిన కేడెట్లకు గ్రూప్‌సాంగ్‌ పోటీలను నిర్వహించామని క్యాంప్‌ కమాండెంట్‌ కల్నల్‌ సునీల్‌ అబ్రహం తెలిపారు.

బహుజన బతుకమ్మ కావాలి

- ప్రజాయుద్ధభేరి అధ్యక్షురాలు విమలక్క
- రేగడిమైలారంలో బతుకమ్మ సంబరాలు

బొంరాస్‌పేట: బహుజన బతుకుల్లో పండుగ సంతోషాలు నిండాలని ప్రజా యుద్ధభేరి అధ్యక్షురాలు విమలక్క ఆకాంక్షించారు. బుధవారం మండలంలోని రేగడిమైలారంలో నిర్వహించిన బహుజన బతుకమ్మ సంబరాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బతుకమ్మను ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ పూల కవాతుగా.. స్త్రీల కవాతుగా ఊరూరా బహుజన బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆడపడుచుల ఆనందాల పండుగ బతుకమ్మను ఉన్నత వర్గాలకే పరిమితం కాకుండా బహుజనుల బతుకమ్మ కావాలని అన్నారు. పూల పండుగ దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం, ప్రకృతి ఆధారంగా పూల పండుగను నిర్వహించి పర్యావరణాన్ని, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే సందేశంతో, సామాజిక న్యాయం కోరుతూ బహుజన బతుకమ్మ సంబరాలు చేస్తున్నట్లు తెలిపారు. మద్యం మత్తును చిత్తు చేస్తూ స్త్రీలపై అఘాయిత్యాలను ఎదిరిస్తూ బహుజన బతుకమ్మ సంబరాలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు కూలి సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, మహిళా సంఘం నాయకురాలు రాజేశ్వరి, ఆర్‌పీఓడబ్ల్యూ పద్మ, దళిత ప్రజాసంఘాల నాయకులు చంద్రయ్య, శ్రీనివాస్‌, రమేశ్‌బాబు, అరుణోదయ మల్సూర్‌, అనితాకుమారి, చెవిటి శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గునుగుపువ్వు సేకరణ



గోమారంలో గునుగుపువ్వు సేకరించి తెస్తున్న మహిళలు

శివ్వంపేట(నర్సాపూర్): బతుకమ్మలు పేర్చేందుకు అధికంగా ఉపయోగించే గునుగుపువ్వు సేకరణలో మహిళలు నిమగ్నమయ్యారు. మండల కేంద్రం శివ్వంపేటతో పాటు అన్ని గ్రామాల్లో శని, ఆదివారాల్లో పెద్ద బతుకమ్మ (సద్దుల బతుకమ్మ) వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. సంవృద్ధిగా దొరికే గునుగు ఈసారి వర్షాలు అధికంగా కురవడం వల్ల పూర్తిస్థాయి పంటలు వేయడంతో పువ్వు దొరకని పరిస్థితి నెలకొంది. ఎక్కడో చోట కొద్దిపాటిగా ఉంటే దాని కోసం మహిళలు శ్రమించాల్సిన పరిస్థితి నెలకొంది.

21న సద్దుల బతుకమ్మ

నర్సాపూర్: ఈనెల 21న సద్దుల బతుకమ్మ, 23న దసరా పండగ జరుపుకోవాలని వేద పండితులు నిర్ణయించారని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు. పట్టణంలోని రాయరావు చెరువు వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన

హవేళీఘనాపూర్(మెదక్): ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ నారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రం హవేళీఘనాపూర్, బూర్గుపల్లి, గాజిరెడ్డిపల్లి, సర్దన గ్రామాల్లో ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమకు నచ్చిన వారికి ఓటు వేయాలని కోరారు. మండలంలో వందశాతం ఓటరు నమోదు అయ్యేలా చూడాలని గ్రామాల్లోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు గ్రామ స్థాయి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీరామ్, కళాకారులు తదితరులు ఉన్నారు.

బీజేపీ స్వశక్తికరణ్ అభియాన్



మాట్లాడుతున్న విజయ్ కుమార్

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని రామతీర్థం, ముద్దాపూర్ గ్రామాల్లో బుధవారం నిజాంపేట్ జెడ్పీటీసీ సభ్యులు పంజా విజయ్ కుమార్ స్వశక్తికరణ్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు బూత్ స్థాయి నుంచి పటిష్టంగా పని చేయాలని సూచించారు. ఆయన వెంట మండల శాఖ అధ్యక్షుడు సంతోష్, బొక్కల నాగేశ్, వడ్ల అరుణ్, పిట్ల ఏసు తదితరులు పాల్గొన్నారు.

146 నదుల జలాలతో అభిషేకం



నది జలాలతో భక్తులు

నిజాంపేట(మెదక్): మండలంలోని నస్కల్ గ్రామంలో కౌండిన్య యూత్ ఆధ్వర్యంలో దేవి నవరాత్రుల సందర్భంగా నాల్గవ రోజు 146 నదుల నుంచి తీసుకొచ్చిన జలాలతో బుధవారం దుర్గమ్మకు అభిషేకం చేశారు. ఈ విన్నూతమైన కార్యక్రమానికి గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కౌండిన్య యూత్ సభ్యులు ప్రభాకర్‌గౌడ్, నరేందర్‌గౌడ్, వంశీ, భాస్కర్, సుచిత్, భాను, రమేశ్, అరవింద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ దసరా ధమాకా

గజ్వేల్‌రూరల్: బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ప్రయాణికులకు నగదు బహుమతులు అందజేస్తున్నట్టు జీపీపీ (గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. గజ్వేల్, ప్రజ్ఞాపూర్, తూప్రాన్ బస్‌స్టేషన్లలో పురుషులు, మహిళలకు వేర్వేరుగా లక్కీ డ్రా బాక్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 30 వరకు బస్సుల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు టికెట్ల వెనుక చిరునామా, ఫోన్ నంబర్ రాసి బస్సు దిగిన తర్వాత లక్కీ డ్రా బాక్సుల్లో వేయాలన్నారు. విజేతలకు ఒక్కొక్కరికీ రూ. 9,900 నగదు బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ పాల్, ఎస్‌టీఐ కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామ రామ రామ ఉయ్యాలో..

జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఆయా గ్రామాల్లోని ఆలయాలు, ప్రధాన కూడల్లో రామ రామ రామ ఉయ్యాలో.. రామనేసి రామ ఉయ్యాలో, శీ లక్ష్మి నీ మహిమలు గౌరమ్మా.. అంటూ పాటలు పాడతూ మహిళలు, యువతులు బతుకమ్మ ఆడారు. అలాగే ప్రభుత్వ కళాశాలల్లో కూడా బతుకమ్మ సంబురాల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో..



చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ కళాశాలలో..



కొడిపల్లి(నర్సాపూర్): బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): జగ్గంపేటలో ..



శివ్వంపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మాట తప్పకుండా అభివృద్ధి చేస్తా

- ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికై తన వంతు కృషి చేస్తానని దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం నార్సింగి మండలంలోని వల్లూరు గ్రామంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వల్లూరు గ్రామస్తులు మొదటి నుంచి బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారని, తనను గెలిపిస్తే ప్రజల ఆశలు వమ్ము చేయకుండా పని చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీగా సమయభావనతో తాను గ్రామానికి రావడం సాధ్యం కాలేదని, ఇక నుంచి మాట తప్పకుండా అభివృద్ధికి పాటు పడుతానని హామీ ఇచ్చారు. గృహలక్ష్మి పథకం కింద ఇంకా అర్హులుంటే వారికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సబిత, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బాబు, సర్పంచ్ ఆనందాస్ మహేశ్వరి, పార్టీ గ్రామ అధ్యక్షుడు వహేద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా బయోఫర్టిలైజర్ ఎరువుల పంపిణీ



రైతులకు బయో ఫర్టిలైజర్‌ను అందిస్తున్న రైతు సంఘం సభ్యులు

నిజాంపేట(మెదక్): మండలంలోని నస్కల్ గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ రైతులకు బయో ఫెస్టిసైడ్ ఎరువులను బుధవారం ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం తునికి వ్యవసాయ నిపుణులు శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బయో ఫర్టిలైజర్ వల్ల రైతులు అధిక దిగుబడి పొందవచ్చని, నేలను సైతం కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అరికల్చర్ అధికారి శ్రీనివాస్, అగ్రి ఇంజనీర్ అధికారి ఉదయ్ రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ నాతి లక్ష్మీగౌడ్, సీఈఓ అశోక్, ఎల్లయ్య, జలంధర్, బాల్‌రాజ్, ఏల్లయ్య, దశరథం, రాజ్యం నర్సింలు, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లి సోషల్ సర్వీస్ అధ్యక్షుడి రాజీనామా



మాట్లాడుతున్న శ్రీకాంత్ సాగర్

రామాయంపేట(మెదక్): మైనంపల్లి సోషల్ సర్వీస్ ద్వారా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైనందున బాధ్యత వహిస్తు రామాయంపేట మండల ఆర్గనైజేషన్ యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్ సాగర్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఆయన ఆర్గనైజేషన్ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మైనంపల్లి సోషల్ సర్వీస్ సంస్థ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చేరిందన్నారు. అక్కన్నపేట గ్రామంలో 35 మంది అనాథ పిల్లలకు రూ.25 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని చెప్పినప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. సేవా సంస్థ పేరుతో ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేర్చలేక వాయిదాలు వేస్తున్నారనే ఆవేదనతో సంస్థకు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సభ్యులు కూడా రాజీనామా చేశారు.

కాంగ్రెస్‌కు వైస్ ఎంపీపీ రాజీనామా



చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రం వైస్ ఎంపీపీ సత్యానారాయణగౌడ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆత్మగౌరవం చంపుకొని కాంగ్రెస్ పార్టీలో పనిచేయలేకపోతున్నానన్నారు. ఎన్నో ఏళ్లుగా కష్టపడ్డ కార్యకర్తలకు మనుగడ లేదన్నారు.

ఇళ్ల మధ్య పారుతున్న మురుగునీరు



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏబీ కాలనీ వాసులు

తూప్రాన్: మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు ఏబీ కాలనీలో రోడ్లపై మురుగునీరు పారుతూ దుర్గంధం వెదజల్లుతున్నా.. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాలనీలో అడ్డదిడ్డంగా రోడ్లు ఉన్నాయని వాపోయారు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని తెలిపారు. వార్డు కౌన్సిలర్‌తో విన్న వించుకున్న సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కౌన్సిలర్ భర్త నర్సోజీతో కలిసి కాలనీ వాసులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహినొద్దీన్‌ను వివరణ కోరగా.. ఏబీ కాలనీలో చాలా రోజులుగా సమస్య ఉన్న విషయం వస్తవమే. శాశ్వత పరిష్కారం కోసం ఇంజనీరింగ్ అధికారులతో అంచనా వేసి, త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

నేటి నుంచి సాఫ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు

తూప్రాన్: ఈ నెల 19 నుంచి 10వ తెలంగాణ సీనియర్ అంతర్ జిల్లాల పురుషుల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు పట్టణ సమీపంలోని బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోడిప్యాక నారాయణ గుప్తా బుధవారం తెలిపారు. క్రీడ పోటీలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఇందులో తెలంగాణ నుంచి సుమారు 20 పురుషుల జట్లు పాల్గొంటాయని, క్రీడాకారులకు గీత స్కూల్‌లో వసతి ఏర్పాటు చేశామన్నారు.



నత్నాయపల్లి అంతర్గత రోడ్డుపై నిలిచిన మురికినీరు

అధ్వానంగా అంతర్గత రోడ్లు

- లోపించిన పారిశుద్ధ్య నిర్వహణ
- దోమలు, ఈగలతో జ్వరాల బారిన గ్రామస్తులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని నత్నాయపల్లి గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. కొన్ని రోజులుగా మురికి కాల్వలు, అంతర్గత రోడ్లు చెత్తా చెదారంతో నిండిపోయి కంపు కొడుతున్నాయి. దీంతో దోమలు ఈగలు స్వైర విహారం చేయడంతో అనేకమంది వివిధ రకాల జ్వరాల బారిన పడుతున్నారు. అంతర్గత రోడ్లపై ఎక్కడికక్కడ మురికి నీరు నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డుతో పాటు వాటర్ ప్లాంట్ ప్రధాన రోడ్డు, ఆయా వీధుల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఈ విషయమై గ్రామ కార్యదర్శి వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

దుర్గాంబికా నమోస్తుతే..

జిల్లా వ్యాప్తంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆయా మండపాల్లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహాలకు, ఆలయాల్లోని అమ్మవార్లకు భక్తులు పూజలు చేస్తున్నారు. నాల్గవ రోజు అమ్మవారు కూష్మాండా దేవిగా దర్శనం ఇచ్చారు.



కొడిపల్లి(నర్సాపూర్): రాయిలాపూర్‌లో అమ్మ వారికి పూజలు చేస్తున్న భక్తులు



శివ్వంపేట(నర్సాపూర్): లక్ష్మీదేవిగా అమ్మవారు



పెద్దశంకరంపేట(మెదక్): గడికోటలో..



కొల్చారం(నర్సాపూర్): ఎనగండ్లలో..



కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో..



అల్లాదుర్గంలో ..



చిన్నశంకరంపేట(మెదక్): మడూర్‌లో..



చిలప్‌చెడ్(నర్సాపూర్) జగ్గంపేటలో ..

సంక్షిప్త వార్తలు

◆ **బీజేపీలో చేరికలు**



చిలప్‌చెడ్(నర్సాపూర్): బీజేపీ సీనియర్ నాయకుడు రఘువీర్ రామిరెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని చండూర్ బీఆర్‌ఎస్ ఎంపీటీసీ గూగ్లోత్ సునీత, దేవ్లానాయక్ దంపతులు బుధవారం బీజేపీలోకి చేరారు. నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఎంపీటీసీ దంపతులకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, జిల్లా ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు కిషన్ నాయక్, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు గుండం శంకర్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, చిలప్‌చెడ్ మండలాధ్యక్షుడు దశరథ్, ప్రధాన కార్యదర్శి సంతోష్, నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్, సత్యం, అంబర్ సింగ్, రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **బీఆర్‌ఎస్‌లో చేరిక**

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరినట్లు పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రమేశ్ బుధవారం తెలిపారు.



వీరికి అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అందోల్ ఎన్నికల ఇన్‌చార్జి ఫారూక్ హుస్సేన్, సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, ట్రైడ్ కమిషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య, వరం చైర్మన్ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం**

వెల్దుర్తి(తూప్రాన్): ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో మృతి చెందిన ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన వడ్ల వీరమణి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం వీరమణి మృతదేహం వద్ద వేర్వేరుగా సంతాపం ప్రకటించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబానికి గృహలక్ష్మి పథకంలో డబుల్ బెడ్రూం మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు.

◆ **జీపీలో చోరీ**

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామ పంచాయతీ కార్యాలయం కిటికి ఊచలు ఊడదీసి చోరీకి పాల్పడ్డ సంఘటన మండలంలోని మల్లుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటనలో గ్రామ పంచాయతీలోని క్రీడా సామగ్రి, ఇతర వస్తువులు చోరీకి గురైనట్లు సర్పంచ్ లక్ష్మి పోలీస్‌లకు ఫిర్యాదు అందించారు. ఈ మేరకు పోలీస్‌లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

◆ **పగిలిన భగీరథ పైపు: ఇద్దరికి గాయాలు**

అల్లాదుర్గం(మెదక్): భగీరథ పైపు పగిలి రోడ్డుపైకి నీళ్లు రావడం, రాళ్లు, మట్టి బైక్‌పై వెళ్తున్న వారు కిందపడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని చిల్వెర గ్రామ శివారులో 161 జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై జరిగింది. చిల్వెర గ్రామ శివారులో రోడ్డు పక్కనే ఉన్న భగీరథ పైపు పగిలింది. అదే ప్రాంతంలో బైక్‌పై వెళ్తున్న చిల్వెర గ్రామానికి చెందిన నరేందర్‌రెడ్డి, నారాయణరెడ్డిలకు రాళ్లు, మట్టి తగలడంతో బైక్‌పై నుంచి కిందపడటంతో గాయాలయ్యాయి.

◆ **చేసిన సేవే గెలిపిస్తాయి**

రామాయంపేట(మెదక్): ప్రజలకు చేసిన సేవా కార్యక్రమాలే మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌ను గెలిపిస్తాయని టీపీసీసీ అధికార ప్రతినిధి రామ్‌చందర్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన రామాయంపేటలో విలేకరులతో మాట్లాడారు. ఆయన వెంట ఎంపీటీసీ నాగులు, బైరం కుమార్, కిషన్ తదితరులు ఉన్నారు.

◆ **మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు**

నిజాంపేట(మెదక్): మండలంలోని తిప్పన్నగుల్ల గ్రామానికి చెందిన బెల్ట్ షాప్ నిర్వాహకుడు శ్రీనివాస్‌గౌడ్ 12 బీరు బాటిల్లు, 23 క్వార్టర్లను అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఈ సందర్భంగా అతనిపై కేసు నమోదు చేశారు.